www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం 14 మే 2025

విలేఖరులు కావలెను

కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రయగల వరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003



# సైనికా.. సెల్యూట్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

- పాక్ న్యూక్లియర్ గాలి తీసేశాం!
- ఆపరేషన్ సింధూర్ విజయానికి త్రివిధ దళాలే కారణం
- ప్రపంచమంతా భారత్ మాతాకీ జై.. ధ్వనులు ప్రతిధ్వనిస్తున్నాయి
- త్రివిధ దళాలు పరాక్రమానికి సెల్యూట్
- ఉగ్ర అడ్డాలను మట్టిలో కలిపేశాం
- పాక్ సేనకు తమ బలమేంటో చాటారు
- సాంకేతితతో త్రివిధ దళాలు ముందుకు
- ఈసారి దాడి జరిగితే.. మామూలుగా ఉండదు!
- ఉగ్రవాదులు, పాక్ ప్రభుత్వానికి మోదీ హెచ్చరికలు

3లో

## ప్రతి భారతీయుడు మీ వెంటే..

మీ పరాక్రమం వల్ల 'ఆపరేషన్ సిందూర్' గొంతుక ప్రపంచంలో ప్రతిధ్వనిస్తుందని మోదీ అన్నారు. ప్రతి ఒక్క భారతీయుడు మీ వెంట ఉన్నారన్నారు. వారి ప్రార్థనలు, ఆశీర్వచనాలు మీ వెంట ఉన్నాయన్నారు. తమ సైనికులు, వారి కుటుంబం పట్ల దేశవాసులు కృతజ్ఞతతో ఋణపడి ఉన్నారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ భారత నీతి, నిజాయితీ, నిర్ణయాత్మక శక్తిని త్రివేణి సంగమంతో పోల్చారు. భారత్ బుద్ధుడి పుణ్యభూమి, గురు గోవింద్ సింగ్ పుణ్యభూమి అన్నారు. ధర్మస్థాపన కోసం ఆయుధాలను అందుకోవడం తమ అవసరమన్నారు. ఉగ్రవాదుల అడ్డాలను వారి ఇళ్లలోకి (పాక్) వెళ్లి కొట్టామన్నారు. వారు ఎవరినీ హెచ్చరించారో వారికి తెలియలేదని, ఇంద్రుడి సేనను హెచ్చరించారని ఫలితం సేన చూపించి వారిని మట్టిలో కలిపేసిందన్నారు. 9 ఉగ్రవాదుల అడ్డాలను నేలకూల్చారన్నారు. వందమంది ఉగ్రవాదుల కంటే ఎక్కువమంది మృతి చెందారన్నారు. ఉగ్రవాదుల అంతానికి సమయం ఆసన్నమైందన్నారు.



# ముల్కనూర్ డెయిరీ ఆదర్శంగా..

# పరకాలలో డెయిరీకి పునాది

**కలంజ్యోతి, భీమదేవరపల్లి** : తెలంగాణలో మహిళల చేత విజయవంతంగా కొనసాగుతున్న ముల్కనూర్ మహిళా స్వకృషి డెయిరీని ఆద ర్శంగా తీసుకొని, అదే తరహాలో పరకాల నియో జకవర్గంలో కొత్తగా డెయిరీ ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ముల్కనూర్ డెయిరీ సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పరకాల నియోజక వర్గంలోని దామెర మండలంలో మహిళలతో డెయిరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామ న్నారు. ఈ డెయిరీ ఏర్పాటుతో పాటు మరో 6 మండలాలలో కూడా మహిళా రైతులతో డెయిరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే 53 సహకార సంఘాలు రిజిస్ట్రేషన్ అయిపోయాయన్నారు. ముల్కనూర్ డెయిరీ ద్వారా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ డెయిరీ ద్వారా కల్తీ లేని, స్వచ్ఛమైన పాలు సరఫరా చేయడం, మహిళలను వ్యాపార రంగంలోకి తీసుకురావడం, ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపా రు. ఇప్పటికే పాడిపశువుల సర్వే, పాల దిగుబడులపై అధ్యయనాలు పూర్తయ్యాయని చెప్పారు.



ముల్కనూర్ సొసైటీలో పరకాల నియోజక వర్గంలోని మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావిణ్య, డాక్టర్ సత్య శారద పాల్గొని ముల్క నూర్ డెయిరీ పరిశీలించారు. డెయిరీ జనరల్ మేనేజర్ మారుపాటి భాస్కర్ రెడ్డి పవర్ ప్రెజెం టేషన్ ద్వారా డెయిరీ కార్యకలాపాలను వివ రించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులు, ముల్కనూర్ డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మారుపాటి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తప్పిపోయిన కాలం

# పుస్తకావిష్కరణ

**కలంజ్యోతి, నిర్మల్** : నిర్మల్ కు చెందిన కవి మడిపల్లి రాజ్ కుమార్ రచించిన 'తప్పిపోయిన కాలం' కవితా సంపుటిని హైదరాబాదులో ఆవిష్కరించారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని రచించిన ఈ పుస్తకాన్ని హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ రమేశ్ సుంకసారి ఆవిష్కరించారు. ఇందులో రచయిత రాజ్ కుమార్ ప్రధానంగా స్థానికతకు పట్టం కడుతూ తన స్వస్థలం నిర్మల్ లోని బంగల్ చెరువు, మహబూబ్ ఘాట్, వేయి ఉరుల మర్రి, నిర్మల్ బొమ్మలు కవితలు రాశారని ఆయన తెలిపారు. ఊరు మంచిగుంటే ఉర్వి బాగుంటుందన్న సూత్రమే రాజ్ కుమార్ కవిత్వానికి మూలమై నిలిచిందన్నారు. కవి మాతృవందనంగా శతాధిక వయోవృద్ధురాలైన తనతల్లికి కావ్యం అంకితం చేసారు. మహేశ్వర ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ పుస్తక సమీక్ష చేశారు. విశ్రాంత రేడియో వ్యాఖ్యాత మడిపల్లి దక్షిణామూర్తి, ప్రవీణ, విజయ్, శతానంద, ఆదిత్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## గంజాయి పట్టివేత

# ఇద్దరి అరెస్టు

**కలంజ్యోతి, నిర్మల్** : నిర్మల్ జిల్లా పెంబి మండలం చిన్న గోదుమల, పోచంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరి వద్ద రూ.1.60 లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నామని అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. వివరాలిలా ఉన్నాయి గోదుమల గ్రామానికి చెందిన కొమురం దొండు రావు, పోచంపల్లి కి చెందిన మెగావత్ కైలాష్ లు తమ భూమిలో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సి హెచ్ అజయ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దొండు రావు వద్ద రూ.1.40 లక్షలు, కైలాష్ వద్ద రూ.20 వేల విలువైన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ అజయ్, ఎస్సై హన్మాండ్లు, సిబ్బందిని అభినందించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎ ఎస్ పి రాజేష్ మీనా స్పష్టం చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు

# పేదలకు వరం

### నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

**కలంజ్యోతి, నర్సాపూర్** : సీఎంఆర్ఎఫ్ చెక్కులను నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను బాగు చేయాలనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ కల్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి అభివృద్ధి కార్య క్రమాలు ఎన్నో చేయడం జరుగుతుందని ఆయన తెలి పారు. పేదలు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు కేటాయించడం ఎంతో గర్వకారమన్నారు. ముఖ్యమం త్రిపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హత్నూర మండల అధ్యక్షుడు కృష్ణ, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ కొన్నాళ్ల వెంకటేశం, నర్సాపూర్ యూత్ కాం గ్రెస్ సీనియర్ నాయకులు తలారి ప్రసాద్, లబ్ధిదారులు తలారి హనుమంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## చీటింగ్ కేసులో శ్రవణ్ రావు అరెస్ట్

**కలంజ్యోతి, హైదరాబాద్:** ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడి శ్రవణ్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. చీటింగ్ కేసులో ఆయనపై అభియోగాలు రావడంతో.. కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారించేందుకు నోటీసులు ఆయనకు అందజేశారు. కాగా.. మంగళవారం సీసీఎస్ పోలీసుల ఎదుట శ్రవణ్ రావు విచారణకు హాజరయ్యారు. ఈ విచారణ అనంతరం శ్రవణ్ రావును పోలీసులు అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. గతంలో అఖండ ఎంటర్ ప్రైజస్ సంస్థను రూ. 6 కోట్ల మేర మోసం చేసినట్లు శ్రవణ్ రావుపై ఆరోపణలున్నాయి. ఈ మేరకు బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి కోర్టులోని న్యాయమూర్తి ఎదుట అతడిని హాజరుపరిచాలని నిర్ణయించారు. అందుకోసం అతడిని న్యాయమూర్తి ఇంటికి తరలించారు.



# సైనిక్.. సెల్యూట్

**చండీగర్ :** భారత సైన్యం న్యూక్లియర్ బ్లాక్ మెయిలర్ గాలి తీసేసిందో ప్రపంచం చూసిందని, ఆకాశం నుంచి పాతాళం వరకూ భారత్ మాతాకీ జై.. అనే ధ్వనులు ప్రతిధ్వనిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మోదీ మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ వైమానిక స్థావరానికి చేరుకున్నారు. వైమానిక దళ సిబ్బందిని కలిశారు. వైమానిక స్థావరంలోనే సైనికులను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. మీరంతా (భారత త్రివిధ దళాలు) 140 కోట్ల మందికి గర్వకారణంగా నిలిచారన్నారు. చారిత్రక పేజీలో ఒక కొత్త పేజీని సృష్టించారని కొనియాడారు. తాను మీ దర్శనం కోసం వచ్చానన్నారు. భారత్ మాతాకీ జై.. అంటే శత్రువుల వెన్నులో వణుకు పుట్టాలన్నారు. నేటి నుంచి భారత పరాక్రమ చరిత్రను ప్రపంచం మననం చేసుకుంటుందని ఇందులో ఆర్మీదే కీలక పాత్ర అవుతుందన్నారు. రాబోయే భవిష్యత్ కు కొత్త ప్రేరణలా నిలుస్తుందన్నారు. వీరుల భూమి నుంచి ఎయిర్ ఫోర్స్, నేవీ, ఆర్మీ అందరూ జవాన్లకు సెల్యూట్ సమర్పించారు.

**ఇక పాక్ కు నిద్దుర పట్టదు..**

ఇక భారత్ పై కన్నేసేందుకు ఉగ్రవాదులు దడదడలాడాలని మోదీ అన్నారు. భారత్ లో విధ్వంసం అంటే ఒకే ప్రతిస్పందన ఉంటుందన్నారు. పాకిస్తాన్ భరోసాతో ఉగ్రవాదులు రెచ్చిపోయారన్నారు. కానీ భారత త్రివిధ దళాలు పాకిస్థాన్ సైనికులతోపాటు, ఉగ్రవాదులను కూడా గాలిలో కలిపేశారన్నారు. ఇప్పుడు పాక్ లోనూ ఉగ్రవాదులకు సురక్షిత కేంద్రాన్ని మిగలనీయబోమన్నారు. తమ ఆయుధ సంపత్తి గురించి ఆలోచించి ఇక పాకిస్థాన్ కు నిద్దుర పట్టదన్నారు. ఆపరేషన్ సిందూర్ తో దేశ ఆత్మబలాన్ని పెంచారన్నారు. ఐక్యతతో కలిపారని చెప్పారు. భారత స్వాభిమానాన్ని మరింత చాటుకున్నారని చెప్పారు.

**25 నిమిషాల్లోనే పరాక్రమాన్ని చూపారు..**

20 నుంచి 25 నిమిసాల్లోనే భారత ఎయిర్ ఫోర్స్ ఉగ్ర అడ్డాలను లక్ష్యాలపై విరుచుకుపడిందన్నారు. ఆధునిక సాంకేతిక శక్తితో కూడుకున్న యుద్ధ నిపుణులే ఇలాంటి లక్ష్యాలను చేధించగలరన్నారు. పాక్ లోని ఉగ్రస్థావరాలను మాత్రమే నాశనం చేయడమన్నారు. కానీ పాకిస్థాన్ తమ యాత్రికుల విమానాలను అడ్డుపెట్టుకొని కుటీలయత్నానికి ప్రయత్నించిందన్నారు. కానీ అత్యంత జాగ్రత్తగా దేశ సైనికులు యాత్రికులకు నష్టం వాటిల్లకుండా జవాబిచ్చి సత్తా చాటగలిగారని హర్షం వ్యక్తం చేశారు. పాక్ లోని ఉగ్రవాదుల అడ్డాలు, ఎయిర్ బేస్ లే కాదు, వారి కుటీల ఆలోచనలు, దుస్సాహసం కూడా మట్టిలో కలిశాయన్నారు. ఎన్నోసార్లు మన ఎయిర్ బేస్ లను టార్గెట్ చేసినా మన అప్రమత్తతో వాటిని తిప్పికొట్టామన్నారు. వారి డ్రోన్లు, ఎయిర్ క్రాఫ్ట్ లు, రాడార్లు, సాంకేతికతలు అన్నింటిని కుదేల్ చేశామన్నారు. ఉగ్రవాదం పట్ల భారత్ లక్ష్మణ రేఖ స్పష్టంగా ఉందన్నారు. ఇప్పుడు ఏదైనా టెర్రర్ అటాక్ అయితే పక్కా సమాధానం ఇస్తామని తేల్చిచెప్పారు. ఎయిర్ స్ట్రైక్, సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్ లతో కూడా జవాబిచ్చామన్నారు.

**బ్లాక్ మెయిల్ ను సీరియస్ గా తీసుకుంటాం..**

న్యూక్లియర్ బ్లాక్ మెయిల్ ను సీరియస్ గా తీసుకుంటామని ప్రధాని స్పష్టం చేశారు. తమ విధానంతోనే సమాధానం ఇస్తామన్నారు. ఉగ్రవాదులను, ఆ దేశ ప్రభుత్వాన్ని వేర్వేరు దృష్టితో చూడబోమన్నారు. వారంతా ఒక్కటేనన్నారు. భారత సేన బలానికి సాక్ష్యమే 'ఆపరేషన్ సిందూర్ అన్నారు. నావికా, వైమానిక, ఆర్మీ అద్భుత పనితీరును ప్రదర్శించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ లో మ్యాన్ పవర్ తోపాటు సాంకేతికత కూడా కీలక భూమిక పోషించిందన్నారు. మేడిన్ ఇండియా ఆయుధాలు కీలక భూమిక పోషించాయన్నారు. పాక్ లక్షల ప్రయత్నాల్లో కూడా సఫలం కాలేక చతికిలపడిందని ఎద్దేవా చేశారు. దీనికంతటికి భారత త్రివిధ దళాలే కారణమన్నారు. మన వద్ద ఉన్న సాంకేతికత శక్తిని పాకిస్థాన్ ఎదుర్కోలేదన్నారు. కొత్త టెక్నాలజీతోపాటు సమస్యలు కూడా ఎక్కువగానే ఉంటాయని, వాటిని మేధస్సుతో టెక్నాలజీని జోడించి చూపెట్టాశారన్నారు.

**శత్రువుకు గుర్తు చేస్తూనే ఉండాలి..**

మీలోని బలం, ధైర్యం, సామర్థ్యాలను ఇలాగే కొనసాగించాలని జవాన్లకు మోదీ పిలుపునిచ్చారు. ఏ క్షణమేనా యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. శత్రువుకు ఈ విషయాన్ని ఎప్పుడూ గుర్తు చేస్తూ ఉండాలని, ఇది నూతన, సాంకేతిక భారత దేశమని తెలియ జెప్పాలన్నారు. శత్రువులను మట్టిలో కలపడం కూడా మనకు బాగా తెలుసని చాటి చెప్పాలన్నారు.















# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

## రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

**కలంజ్యోతి, హైదరాబాద్ :** వేసవి దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలు వాటి నివారణ, వన్యప్రాణి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో అటవీ శాఖ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ తీసుకున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించి అటవీ సంపద కాస్తా బూడిదవుతాయని చెప్పారు. ఇలాంటి ప్రమాదాలతో ఏటా వేలాది వృక్షాలు మంటలకు ఆహుతి అవుతున్నాయన్నారు. అడవుల్లో వంట చేయడం, సిగరెట్, బీడీ, చుట్ట లాంటివి తాగి అక్కడ పడేయడంతో అటవీ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్న అటవీ శాఖ నివేదికలను అధికారుల ముందుంచారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్. సువర్ణ, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఈలు సింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వర్చువల్ ద్వారా సమావేశంలో వివిధ జోన్ల సీసీఎఫ్‌లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలు పాల్గొన్నారు.

# చెంచులకు 10 వేల ఇందిరమ్మ ఇండ్లు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కలంజ్యోతి, హైదరాబాద్ :** తరతరాలుగా సొంత ఇండ్లకు నోచుకోని ఆదిమ గిరిజన తెగలలోకి అతి బలహీన వర్గమైన చెంచుల సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేయబోతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలో సచ్యురేషన్ పద్ధతిలో దాదాపు 10 వేల చెంచు కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లపై మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పలు సందర్భాలలో సూచించడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారన్నారు. వారిద్దరి సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాలలోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని , హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. గత ప్రభుత్వం కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి హైదరాబాద్‌లో ఉన్నపేదలకు కేటాయిస్తే వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టకొని పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలోనే జీ ప్లస్ త్రీ పద్ధతిలో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

# అరకొర వసతులు..

# అడ్డగోలు వసూళ్లు



**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టులో టెండర్ దారులు భక్తులను నిలువునా దోచుకుంటున్నారని కొడిమ్యాలకు చెందిన ఉప్పు చంద్రశేఖర్ అనే భక్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. నిబంధనలు పాటించకుండా వేయించిన రేట్ల కంటే అధికంగా తీసుకుంటున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నాడు. వాహన పూజ దగ్గర అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆలయంలో హుండీలో వేయాల్సిన డబ్బులను అర్చకులు అడిగిమరీ తీసుకుంటున్నట్లు ఫిర్యాదు ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వేసవి దృష్ట్యా భక్తులకు సౌకర్యాలు మెరుగుపరిచి దోపిడీని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరాడు. కొండగట్టు అంజన్న భక్తులను కొండపై కొందరు టెండర్ దుకాణదారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అందిన కాడికి గుంజుతున్నారు. కొండపైకి వచ్చింది మొదలు దర్శనం పూర్తయ్యే వరకు ఏం కొనాలన్న అడిగినంత ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొందని భక్తులు ఆరోపిస్తున్నారు. వాహన పూజ మొదలుకొని తలనీలాలు సమర్పించే వరకు అడిగిన ప్రతి చోట చేయి తడపాల్సిందే అన్నట్లుగా పరిస్థితి తయారైంది. ఇదేంటని ప్రశ్నిస్తే ఇక్కడ ఇంతే కొంటే కొను లేకపోతే దిక్కున్న చోట చెప్పుకోమంటూ భక్తులపైనే చిందులు తొక్కుతున్నారు. రద్దీ రోజుల్లో దోపిడీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని భక్తులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా వేసవికాలంలో అంజన్న దర్శనం కోసం వస్తున్న భక్తులకు తిప్పలు తప్పడం లేదు. కార్పెట్లు సరిగా లేకపోవడం, కూల్ పెయింట్ వేయించకపోవడంతో భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్ల కింద వాహనాలు పార్కింగ్ చేయడంతో ఎర్రటి ఎండలో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

### రద్దీ రోజుల్లో భక్తుల జేబులకు చిల్లులు..

కొండగట్టు ఆంజనేయస్వామి వారి ఆలయానికి మంగళ, శనివారాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఈ రోజుల్లో కొన్ని రకాల సేవలకై భక్తులు టికెట్లు కొన్నప్పటికీ వాటిని పొందేందుకు చేయి తడపక తప్పడం లేదని భక్తులు చెబుతున్నారు. కొబ్బరికాయల విక్రయం, కూల్ డ్రింక్స్, కిరాణా షాప్, కొబ్బరి ముక్కలు, పూలు పండ్లు, చెప్పులు ఇలా ప్రతి చోట అధిక రేట్లు తీకుంటున్నారు. వాహన పూజ, తల నీలాలు వంటి వాటికై టికెట్లు కొంటున్నప్పటికి మళ్ళీ చేయి తడపాల్సిందేనని భక్తులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధిక రేట్లపై భక్తులు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ టెండర్ దుకాణదారుల పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఒకవేళ తీసుకున్న నామ మాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నట్లు తెలుస్తుంది.కాంట్రాక్టర్ల పట్ల ఉదాసీనత ఎందుకు..!నిబంధనలు పట్టించుకోకుండా వ్యాపారాలు చేస్తున్న వారి పట్ల ఆలయ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు కొందరు ఆలయ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. అసలు వీరిని కట్టడి చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోగా సదరు వ్యాపారుల పట్ల చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. అయితే టెండర్ దారుల నుండి కొందరు ఆలయ ఉద్యోగులకు నెలనెలా మామూళ్లు అందడంతోనే కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.




### భక్తుల సందడితో కిటకిటలాడిన కొండగట్టు..

ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీతో సందడిగా మారింది. వేసవి సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో క్యూలైన్లు ప్రాంగణము కల్యాణ కట్ట పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయము స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించిన అనంతరం మూలవిరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు తామెత్తు బంగారం (బెల్లం) స్వామివారికి సమర్పించి తీర్చుకున్నారు. సుమారు 25వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### కొనసాగుతున్న అభివృద్ధి పనులు..

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పెద్ద జయంతి సమీపిస్తున్న వేళ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఉత్తర ద్వారం సమీపంలో దారి వెడల్పు, నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రూ. 35లక్షలతో చేపట్టిన మాలవిరమణ కోసం జీఐ షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

# పాక్ పీవోకేను ఖాళీ చేయాల్సిందే!

- విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్
- ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకూ సింధు జలాల నిలిపివేత
- కశ్మీర్ పై భారత్ వైఖరి మారదు
- మధ్యవర్తిత్వం అవసరం లేదు
- అమెరికా చర్చల్లో వాణిజ్య ప్రస్తావనే లేదు



**న్యూఢిల్లీ :** పాక్ ఆక్రమిత కశ్మీర్ ను పాకిస్థాన్ ఖాళీ చేయాల్సిందేనని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ హెచ్చరించారు. మంగళవారం ఆపరేషన్ సింధూర్‌పై భారత విదేశాంగ శాఖ మీడియా సమావేశం నిర్వహించింది. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్ విధానంలో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేసింది. కాల్పుల విరమణపై డీజీఎంవోల సమావేశంలో చర్చించామని తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించిన పాకిస్థాన్ పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని భారత్ మరో సారి స్పష్టంచేసింది. భారత్‌తో సహా ప్రపంచ దేశాల్లోని అమాయకులను ఈ ఉగ్రవాదులు బలి తీసుకున్నారని పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలే మార్గమని భారత్ పునరుద్ఘాటించింది. ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని స్పష్టం చేసింది. పీవోకేను పాక్ ఖాళీ చేసే అంశం మాత్రమే మిగిలి ఉందని వెల్లడించింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే చర్చలు ఉంటాయని ఆయన వివరించారు. టీఆర్ఎఫ్ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అని తెలిపారు.

**భారత్ వైఖరి సుస్పష్టం..**

'కాల్పుల విరమణపై మా వైఖరి సుస్పష్టం. ప్రపంచ దేశాల నుంచి సంప్రదింపులు జరిపిన వారితోనూ ఇదే విషయాన్ని చెప్పాం. ఉగ్రవాదులను అణచివేయడమే భారత్ ప్రాథమిక లక్ష్యం. ఉగ్రస్థావరాలపై భారత్ దాడి చేసింది. ప్రతిగా పాక్ దుస్సాహసానికి దిగింది. ప్రతిచర్యగానే భారత్ దాడులు చేసింది. వాళ్లు కాల్పులు నిలిపివేస్తే భారత్ దాడులు ఆపేస్తుంది. ఇదే విషయాన్ని ప్రపంచ దేశాలకు చెప్పాం. మేము చెప్పిన విషయాన్ని ప్రపంచ దేశాల నాయకులు పాక్‌కు చెప్పి ఉంటారు. భారత్ చెప్పిన విషయాన్ని పాక్ పెడచెవిన పెట్టింది' అని రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

**వాణిజ్యం ప్రస్తావనే రాలేదు..**

భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ తాను మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనను భారత్ మరోసారి తోసిపుచ్చింది. ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి 10 వరకు జరిగిన సైనిక చర్యలపై భారత్‌అమెరికా మధ్య చర్చలు జరిగాయని తెలిపారు. యుద్ధ వాతావరణంలోనే చర్చలు జరిగాయి తప్పా వాణిజ్య అంశాలు ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని జైశ్వాల్ కుండ బద్దలు కొట్టారు.

**కాల్పుల విరమణకు పాక్ పాకులాట**

కాల్పుల విరమణకు సంబంధించి ఇరుదేశాల మధ్య డీజీఎంవోల స్థాయిలోనే చర్చలు జరిగాయని, వీటి వివరాలను ఇప్పటికే తెలియజేశామని విదేశాంగశాఖ వెల్లడించింది. మే 10వ తేదీన పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ నుంచి ఫోన్ వచ్చిందని చెప్పారు.మే 12న మధ్యాహ్నం 12.37గంటలకు భారత విదేశాంగశాఖకు ఫోన్ వచ్చిందని తెలిపింది. అయితే, తొలుత సాంకేతిక కారణాల వల్ల పాకిస్థాన్ హాట్‌లైన్‌లో కనెక్ట్ కావడంలో ఇబ్బందులు పడిందని, తర్వాత మధ్యాహ్నం 3.25గంటలకు భారత డీజీఎంవోతో చర్చలు జరిగాయని పేర్కొంది. కాల్పుల విరమణకు ఎవరు ఎవరికి ఫోన్ చేశారనేది ప్రపంచం గుర్తించిందని భారత విదేశాంగశాఖ వెల్లడించింది.

# పాక్ హైకమిషన్ ఉద్యోగి బహిష్కరణ

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ కొనసాగుతున్న వేళ భారత్ అనూహ్య నిర్ణయం తీసు కున్నది. కార్యాలయ పరిధి దాటి కార్యకలాపాలు సాగిస్తున్న పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగిని దేశం నుంచి బహిష్కరించింది. 24 గంటల్లోగా భారత్ నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేసింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ ఆదేశాలు వెలువ రించింది. తమ నిర్ణయాన్ని తెలియజేస్తూ భారత్ లో పాకిస్థాన్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న అధికా రికి లేఖ రాసింది. అయితే, ఆ అధికారి పేరును మాత్రం వెల్లడించలేదు. 'న్యూఢిల్లీలోని పాక్ హైకమిషన్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారి.. దేశంలోని అధికారిక కార్యక్రమాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నందున ఆయనను పర్సోనా నాన్ గ్రేటాగా భారత ప్రభుత్వం ప్రకటించింది. 24



గంటల్లోగా దేశాన్ని విడిచి వెళ్లాల్సిందిగా అతన్ని ఆదేశించింది' అని ఎంఈఏ ఆ ప్రకటనలో తెలిపింది. భారత్‌పాక్ మధ్య నాలుగు రోజులపాటు తీవ్ర మిలటరీ ఉద్రిక్తతలు కొనసాగిన నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. హైకమిషన్ అధికారి ప్రవర్తనపై పాక్ ఛార్జ్ డిఎఫైర్స్‌కు భారత్ లాంఛనంగా సమాచారం తెలియజేసింది. ఒక దేశం మరొక దేశ దౌత్యవేత్తపై తీసుకోదగిన తీవ్రమైన చర్యగా "పర్సోనా నాన్ గ్రాటా''ను చెప్పవచ్చు. ఆతిథ్య దేశం ఏ సమయంలోనైనా ఎలాంటి వివరణ లేకుండా దౌత్య సిబ్బందికి చెందిన వ్యక్తిని నాన్ గ్రేటాగా ప్రకటించవచ్చు.




# కేటీఆర్ కు పార్టీ పగ్గాలు ఇస్తే స్వాగతిస్తా

## మాజీ మంత్రి హరీశ్ రావు


- బీఆర్ఎస్ లో ఎటువంటి విబేధాలు లేవు
- నా లీడర్ కేసీఆర్ ఆయన మాటే వేదం
- నేను క్రమశిక్షణ గల కార్యకర్తను
- రైతులు పంట అమ్ముకోవడానికి యుద్ధం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** కేటీఆర్ కు బీఆర్ఎస్ పార్టీ బాధ్యతలు అప్పగిస్తే.. స్వాగతిస్తానని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ లో ఎటువంటి విబేధాలు లేవని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ పగ్గాలు కేటీఆర్ కు ఇస్తే తప్పకుండా స్వాగతిస్తానని తెలిపారు. గత 25 ఏళ్లుగా పార్టీలో నిబద్ధతో పని చేస్తున్నాను.. నా లీడర్ కేసీఆర్.. ఆయన చెప్పినట్లు నడుచుకుంటానని తెలిపారు. కేసీఆర్ గీసిన గీతను దాటను.. ఈ విషయం ఇప్పటికే వందల సార్లు చెప్పానన్నారు. ఇప్పుడు కూడా అదే చెబుతున్నానని అని మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. పార్టీకి నేను క్రమశిక్షణ గల కార్యకర్తను అని స్పష్టం చేశారు. ఒకవైపు దేశం కోసం మనవాళ్లు యుద్ధం చేస్తుంటే.. మరోవైపు రైతులు తమ పంట అమ్ముకోవడానికి మరో యుద్ధం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ధాన్యం రాశులను గాలికి వదిలేసి అందాల రాశుల చుట్టూ సీఎం తిరుగుతున్నారు అని ఎద్దేవా చేశారు. రైతుల దగ్గర పంటను కొనడం లేదన్నారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. రైతులకు రూ.4 వేల కోట్లు ప్రభుత్వం బకాయి పడిందని తెలిపారు. రైతు పెట్టుబడి సాయం అందించడంలో కూడా జాప్యం కొనసాగుతుందని హరీశ్ రావు అన్నారు. రైతుల ధాన్యంలో తరుగు తీయమని సీఎం అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. కానీ, క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఓ రైతు ఆత్మహత్యయత్నం చేసుకున్నారు. నిన్న మహబూబాబాద్ జిల్లాల్లో కిషన్ అనే రైతు చనిపోయారని తెలిపారు. ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతులు ఎండ దెబ్బతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి సహజ మరణాలు కావు.. ప్రభుత్వం చేసిన హత్యలు అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# సీఎంతో ఆర్టీఐ కమిషనర్ల భేటీ

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్ర సమాచార ఆర్టీఐ కమిషనర్లుగా నియమితులైన నలుగురు మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో జుబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్ కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శాలువలు కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.



# ఓజీ షూటింగ్‌లో శ్రియారెడ్డి




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ఓజీ' . ఇందులో పవన్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాదులో పునఃప్రారంభమైంది. ప్రముఖ నటి శ్రియా రెడ్డి కూడా 'ఓజీ' షూటింగ్‌లో పాలుపంచుకున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ఆమె మంగళవారం పాల్గొన్నారు. సెట్స్‌లోకి తిరిగి రావడం పట్ల శ్రియా రెడ్డి తన సంతోషాన్ని, ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. దర్శకుడు సుజీత్, చిత్ర బృందంతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. "మరోసారి ఓజీ సెట్స్‌లోకి వచ్చేశాను. సుజీత్ అండ్ గ్యాంగ్.. ఇలా ఉత్తమ బృందంతో పనిచేస్తున్నా. ఇక ఆయనతో పనిచేయడానికి చాలా ఉత్సాహంగా ఉన్నది. ఇదొక అద్భుతమైన అనుభవం. ఇంత డెప్త్ ఉన్న పాత్రను పోషిస్తున్నందుకు నిజంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని శ్రియా రెడ్డి పేర్కొన్నారు. 'సలార్' చిత్రంలో రాధా రమ పాత్రలో తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు పొందిన శ్రియా రెడ్డి, 'ఓజీ'లో కూడా ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.